

చెరువులో ఈతకు దిగి విద్యార్థి మృతి

– సొర్నాయి గూడలో విషాదఛాయలు

- శోక సంద్రంలో కుటుంబీకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: చెరువులో ఈతకు దిగి ఓ గిరి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని సొర్నాయి గూడ గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు.. గ్రామంలోని కొర్రా స్వామి(15) అనే గిరి విద్యార్థి ఆ గ్రామానికి సమీపంలోని చెరువు సమీపంలో శనివారం ఉదయం పశువుల మేతకు తీసుకెళ్లారు. ఆ సమయంలో సరదాగా చెరులో ఈతకు దిగి మునిగి చనిపోయినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. విద్యార్థి మండలంలోని కిల్లోగూడ ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. కొడుకు చెరువులో మునిగి మృతి చెందడంతో కుటుంబీకులు రోధించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా హాస్పిటల్ కు తరలించారు.

ఒప్పంద ఉద్యోగులకు ని'బంధనాలు'

▶▶ క్రమబద్ధీకరణకు అడ్డంకిగా ఐదేళ్ల సర్వీస్ ▶▶ తెలంగాణా మాదిరిగా రెగ్యులర్ చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఒప్పంద ఉద్యోగుల క్రమ బద్ధీకరణకు విధించిన నిబంధనలతో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు నిరాశే మిగిలింది. 2014 జూన్ 2 నాటికి ఐదు ఏళ్ళు పూర్తి చేసుకున్న ఒప్పంద ఉద్యోగులనే క్రమబద్ధీకరించాలన్న నిర్ణయంపై మిగతావారి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా టిడబ్ల్యు విద్యాశాఖలోని 1500 మందికి పైగా సిఆర్‌టిలు క్రమబద్ధీకరణ అవకాశం కోల్పోయారు. చాలా విభాగాల్లో ఇదే దుస్థితి నెలకొంది. దీంతో నాలుగేళ్లుగా గంపెడాశలు పెట్టుకున్న ఒప్పంద ఉద్యోగులకు ఎండమావులే మిగిలాయి. 2014 నాటికే ఐదేళ్ల నిబంధన ఎత్తివేయాలంటూ కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవాలంటూ వేడుకుంటున్నారు. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిబంధనపై పునరాలోచించాలని తమకు పదేళ్ల సర్వీసు ఉన్న క్రమబద్ధీకరణకు నోచుకోకుండా పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఎలాంటి నిబంధనలు చెప్పని జగన్ ఇప్పుడు కోతలు వేస్తున్నారని ఒప్పంద ఉద్యోగులు మండిపడుతున్నారు. 2014 జూన్ 2 నాటికి ఐదు ఏళ్ళు సర్వీస్ పూర్తి చేసుకున్న నిబంధన తీసివేయాలని, 2014 నాటికి విధుల్లో ఉన్న వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలకు ముందు క్రమ బద్ధీకరిస్తామని చెప్పిన సిఎం జగన్ ప్రస్తుతం లేనిపోని నిబంధనలు పెట్టడం సరికాదని పలువురు ఒప్పంద ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా చేస్తే తామంతా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు వాపోయారు. ప్రభుత్వం కనికరించి నిబంధనలు సడలించాలని కోరారు.

అందరినీ రెగ్యులర్ చేయాలి

క్రమబద్ధీకరించాల్సిన ఒప్పంద ఉద్యోగుల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం మెలిక పెట్టడం ఒప్పంద ఉద్యోగులకు మోసం చేయడమే. ఎన్నికలకు ముందు ఎక్కువ మందిని క్రమబద్ధీకరిస్తామని జగన్ హామీ నెరవేర్చాలి. ముందు పలు సభల్లో ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. తమను ఆదుకునేందుకు ప్రయత్నం చేయాలి.



టి.నూకరాజు
సిఆర్‌టి యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు

సంఖ్యను తగ్గించేందుకే ఆంక్షలు

ఎన్నికలకు ముందు ఎక్కువ మందిని క్రమ బద్ధీకరిస్తామని ఇప్పుడు ఈ సంఖ్యను తగ్గించేందుకు కొత్త ఆంక్షలు తెరపైకి తేవడం దారుణం. అర్హత, సర్వీసు ఆధారంగా వీలైనంత మందిని రెగ్యులరైజ్ చేస్తామని 2014 జూన్ 2 నాటికి ఐదు ఏళ్ళు సర్వీస్ పూర్తి చేసుకున్న నిబంధన పెట్టడం సరికాదు. సాధారణ ఎన్నికల ముందు పలు సభల్లో ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.



కె.భానుమూర్తి
సిఆర్‌టి యూనియన్ జిల్లా కార్యదర్శి

నిబంధనలతో నష్టం

ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు విధించిన నిబంధనలతో ఒప్పంద ఉద్యోగులకు నిరాశే మిగిలింది. రెగ్యులర్ అవుతుందని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. కమిటీల పేరుతో కాలయాపన చేసి నాలుగేళ్ల తర్వాత కొందరికే అనడంతో ఆవేదన చెందుతున్నాం. నిబంధనతో వేల మంది ఉద్యోగులు అర్హత కోల్పోయారు. దీంతో, తామంతా రోడ్డున పడతాం.



జి.గణేశ్వరరావు
సిఆర్‌టి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

ఆందోళన చెందుతున్నాం..

ఎన్నికల ముందు జగన్ మాట నమ్మిన వేలమంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. పొరుగునున్న తెలంగాణ ప్రభుత్వం 2014 జూన్ 2 నాటికి ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తే..ఏపి ప్రభుత్వం మాత్రం 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని క్రమబద్ధీకరిస్తామనే నిబంధన పెట్టి ఉద్యోగుల సంఖ్యను ప్రభుత్వం భారీగా తగ్గించింది. ఈ విధంగా చేయడం సరికాదు. మరోమారు ఆలోచించాలి.



బి.మోహనరావు
సిఆర్‌టి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రోడ్డు నిర్మాణంతో..

రైతులకు నష్టం కలిగిస్తే ఊరుకోం

జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: కొత్తవలస, కేకే లైన్ కిరండోల్ రెండవ రోడ్డు పనుల విస్తరణతో రైతుల జిరాయితీ భూమి నష్టానికి గురి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు హెచ్చరించారు. శనివారం ఎగువశోభ, టోకురు పంచాయతీ గ్రామాల్లో సందర్శించిన రైలు రోడ్డు నిర్మాణంతో కాఫీ, సిల్వర్ ఓక్, పలసయ్య తోటలకు జరుగుతున్న నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పనుల జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. రైల్ రోడ్డు విస్తరణతో పలస తోటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని సంబంధిత రైల్వే శాఖ డిఇ వెంకటరాజు, గుత్తేదారుడు కిషోర్ వెంకటేష్ లను గంగరాజు నిలదీశారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు సిల్వర్, కాపీ తోటలను పూర్వకాలం నుండి సాగులో చేస్తున్నారని, అధికారులు తప్పుడు రికార్డులు సృష్టించి రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

ఎగువశోభ పంచాయతీ పొర్లు పదర్ గ్రామానికి చెందిన సొంటరి బీమన్న సర్వే నెంబర్ 21లో 11 ఎకరాల 32 సెంట్లు భూమి ఉందని, అలాగే సాగర సన్యాసికి చెందిన సర్వే నెంబర్ 20లో 8 ఎకరాల 57 సెంట్ల భూమిలో తవ్వకాలు జరిపి మట్టిని కుప్పలుగా వేయడంతో ఇటు భూమి, అటు తోటలు పాడైపోతున్నాయని తెలిపారు. నష్టపోయిన భూముల రైతులను రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు గుర్తించి సర్వేలు నిర్వహించి మరోచోట భూములు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎగువ శోభ సర్పంచ్ కొర్రా సింహాద్రి, సిపిఎం నాయకులు గెమ్మెల దేవన్న, వార్డు మెంబర్ పాంగి లక్ష్మణరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న గంగరాజు, సిపిఎం నేతలు

యువత మంచిమార్గంలో నడవాలి

- పాడేరు సిఐ సుధాకర్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: యువత సన్మార్గంలో నడవాలని పాడేరు సిఐ బి.సుధాకర్ అన్నారు. అల్లూరి జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు సిఐ సుధాకర్, పాడేరు ఎస్‌ఐలు లక్ష్మణరావు, రంజిత్ గుట్టులుపుట్టు పంచాయతీ సంతబయలు, డబ్బపుట్టు, వంతలగుమ్మి గ్రామాల్లో శనివారం పర్యటించి శాంతి భద్రతలపై గ్రామస్తులతో చర్చించి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామాల పరిధిలోని కేసులను వివరిస్తూ మరల పోలీసు కేసులు పునరావృతం కాకుండా అవగాహన కల్పించారు. యువత వాహనాలు జాగ్రత్తగా నడపాలని, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని, లేకపోతే చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వివరించారు. యువత మంచిగా చదువుకొని ప్రయోజకులు కావాలని కోరారు. సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సిఐ సుధాకర్

అంగన్‌వాడీ వర్కర్ హత్య కేసులో..

నిందితున్ని శిక్షించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రకాశం జిల్లా టంగుటూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రాయవరం అంగన్వాడీ కార్యకర్తను ట్రాక్టర్‌తో గుద్ది చంపిన కొండలరావు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ రంపచోడవరం అంబేద్కర్ సెంటర్‌లో శనివారం అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు ఆందోళన, ధర్నా చేపట్టారు. అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల ఆధ్వర్యంలో మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ, మరణించిన అంగన్వాడీ కార్యకర్త కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లింపుతోపాటు బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నిందితుడు కొండలరావును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ భారీ నినాదాలు చేశారు. గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బందికి రక్షణ లేకుండా పోతోందని, మరోవైపు అధికారులు, నేతలతోపాటు అన్ని వర్గాల నుంచి వేధింపులు, ఒత్తిళ్ల ఎక్కువవుతున్నాయన్నారు. వీటిని నియంత్రించేందుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టి, అంగన్వాడీలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ రంగమ్మ, రాజేశ్వరి, కెవి రామలక్ష్మి, దేవి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

సవాల్‌కు ముఖం చాటేసిన

అనంతబాబు రాజీనామా చేయాలి

ప్రజాశక్తి- చింతూరు: తనపై అవినీతి, అక్రమాలు, హత్యా నేరారోపణలపై ఆధారాలు చూపిస్తే దేనికైనా సిద్ధమేనని బహిరంగ చర్చకు సవాల్ విసిరిన ఎమ్మెల్సీ అనంతబాబు, అందుకు సిద్ధపడి బిజెపి నేతలు ముందుకొస్తే, అనంతబాబు ముఖం చాటేయడంపై మండిపడ్డారు. చర్చకు తప్పించుకోవడమంటే, ఆరోపణలన్నీ వాస్తవాలని ఒప్పుకున్నట్టేనా అని ఎదురుదాడికి దిగిన బిజెపి నేతలు, దీనికి బాధ్యత వహిస్తూ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ అనంతబాబు సవాల్‌ను స్వీకరించి, బిజెపి నేత పాయం వెంకయ్య ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుండి చింతూరు బస్‌స్టాండ్ సెంటరుకు బిజెపి నేతలు చేరుకున్నారు. బిజెపి సీనియర్ నేతలుపాయం వెంకయ్య, కారం దారయ్య, కుంజా సత్యనారాయణమ్మ డివిఎస్ఎన్ రమణారెడ్డి, కె.రమణ. ముత్యాల రాంబాబు, మూడి సతీష్‌కుమార్, ఊయక రత్తయ్య సన్యాసి, చింతా దుర్గారావు, నర్సింహారావు, ముర్ల బాలరెడ్డి, మడకం వరప్రసాద్‌దొర, తుర్రం బాబూరావు, పి సాగర్, సవలం ముత్తయ్య, సోడి రమేష్, సొడి వెంకటరావు మిడియం జోగయ్య తదతర బిజెపి నేతలు ఎమ్మెల్సీ అనంతబాబు సవాల్‌కు సిద్ధపడి చర్చకు వస్తారేమోనని ఎదురుచూసినా రాకపోవడంతో విమర్శలు గుప్పించారు. బిజెపి నేతలకు సంఘీభావంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, శీలం తమ్మయ్య ఉన్నారు.

గిరిజన భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం గ్రామ పరిధిలో గిరిజన భవన నిర్మాణానికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. రూ.26.25 లక్షల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవి మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గిరిజన భవనానికి నిధులు కేటాయించి, శంకుస్థాపన చేశామని, త్వరలోనే పనులను ప్రారంభించి, ఈ గిరిజన ప్రజల చిరకాల కోరిక తీర్చనున్నట్లు వెల్లడించారు. ఆనంతరం కొయ్యూరు మండల పరిధిలో ఎంపి గొట్టేటి మాధవి నియోజకవర్గ అభివృద్ధి కోటా నిధులు రూ.14 లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివ ప్రసాద్, జెడ్‌పిటిసి వారా నూకరాజు, పోతురాజు బాలయ్య పడాల్, ఎంపిపి రమేష్, ఎంపిటిసిలు బిడిజన అప్పారావు, అంబటి నూకాలమ్మ, సర్పంచి పింటా సింహాచలం బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు నర్సి కిరణ్, వైసిపి మండల అధ్యక్షుడు హుస్సేన్, చింతపల్లి ఎఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, స్థానిక మండల నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సంక్షేమ పథకాల అమలుపై ఆరా



గడపగడపలో సంక్షేమ పథకాల బ్రోచర్లను ఇస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలోని లుబ్బర్తి రోడ్ చింతలపూడి, లొద్ది పాకలు, సింగరాలపాడు, చింతలపూడి గ్రామాలలో శనివారం స్థానిక ఎమ్మెల్యే శ్రీ కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జఅరకు ఎంపీ గొడ్డేటి మాధవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి, అన్ని కుటుంబాలలోని సభ్యులందరితోనూ కలిసి మాట్లాడారు. జగన్ నాయకత్వంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే మరోమారు సిఎంగా జగన్‌కు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైకార్ రాష్ట్ర డైరెక్టర్ సరస్వతి, ఎంపిపి బడుగు రమేష్, చింతపల్లి ఎఎంసి చైర్‌పర్సన్ రాజులమ్మ ,వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, సర్పంచులు ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎంగా జగ్గారావు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా జగ్గారావు శనివారం ఉదయం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. విశాఖ జిల్లా భీమిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు.. కాగా ఇప్పటివరకు సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న రామన్నపడాల్‌ను విద్యాశాఖ ఉత్తర్వులు మేరకు పెదబయలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. ఆయన అక్కడ విధుల్లో చేరినట్లు సమాచారం.



హెచ్‌ఎంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తున్న జగ్గారావు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- అడ్డతీగల : అడ్డతీగల, వేటమామిడి ప్రధాన రహదారిలో శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాల య్యాయి. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడు మెట్ట గ్రామానికి చెందిన ఎఫ్ .నాగేంద్రబాబు రాజమండ్రి నుండి అడ్డతీగల బంధువుల ఇంటికి వస్తున్న బైక్‌పై వస్తుండగా, రోడ్డుపైకి ఒకేసారి గేదెలు అడ్డుగా రావడంతో ప్రమాదానికి గురయ్యాడని .ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తీవ్రంగా గాయాలైన నాగేంద్రబాబును ఆటోలో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్లో వైద్య సేవలు చేస్తున్నట్లు సమీప బంధువులు తెలిపారు.



గాయపడిన నాగేంద్రబాబు

నదిలో మునిగి అర్చకుడు మృతి



అర్చకుని మృతదేహాన్ని నదిలోంచి తీస్తున్న స్థానికులు, ఇన్‌సెట్‌లో ఉమామహేశ్వరశర్మ

ప్రజాశక్తి - చింతూరు : మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ, శివాలయాల్లో దాదాపు 30ఏళ్లుగా అర్చకులుగా పనిచేస్తున్న కలగా ఉమామహేశ్వరశర్మ (55) శనివారం ప్రమాదవశాత్తు శబరి నదిలో మునిగి మృతి చెందారు. మరమ్మతుకు గురైన పైప్‌లైన్ పరిశీలనకు నదిలో దిగిన ఉమామహేశ్వరశర్మ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే నీటిలో దిగి గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటికి శబరి నది బ్రిడ్జి ప్రాంతంలో పూజారి మృతదేహం లభించింది.

ఏళ్ల తరబడి రెండు దేవాలయాల్లో అర్చకులు వ్యవహరించడంతోపాటు ఈ ప్రాంతంలో వివాహాది శుభకార్యాలలో పాల్గొని అనేక జంటలకు పెళ్లిళ్లు చేశారు. ఆంధ్ర, తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోనూ పౌరోహిత్యం చేస్తూ, ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటూ, అందరికీ సుపరిచితులయ్యారు. కొంతకాలం క్రితం ఉమామహేశ్వరశర్మ భార్య కూడా అనారోగ్యంతో మరణించారు. మృతుని కుమారుడు అభి కూడా ప్రస్తుతం తండ్రి బాటలోనే అర్చకునిగా కొనసాగుతున్నారు. కూతురు యూఎస్ఎలో స్థిరపడినారు. కనకదుర్గ ఆలయంలో ధూప దీప నైవేద్యాలు పెడుతూ, మండల కేంద్రంలోనేకాక పలు గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గంజాయితో యువకుడు అరెస్ట్



గంజాయితో పట్టుబడిన యువకునితో పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. స్థానిక రామాలయం సెంటర్లో పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు చేపడుతుండగా, జికె.వీధి మండలం దారకొండ నుంచి సీలేరు మీదుగా బ్యాగ్‌తో వెళుతున్న యువకుడు, రామాయణ సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గుర్తించి, అతనిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌ను పరిశీలించగా ఆరు కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుడి నుంచి సెల్‌ఫోన్, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వ్యక్తిని కేరళకు చెందిన మహ్మద్‌బషీర్‌గా గుర్తించామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, శనివారం ఉదయం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామకృష్ణ వెల్లడించారు.

కాఫీ ఎఐఐపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో పని చేస్తున్న కాఫీ లైజన్ వర్కర్లపై వేధింపుల గురించి చేస్తున్న కాఫీ ఎఐఐ అప్పలనాయుడుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిని ధర్మన్నపడాల్, జి.దీనబంధు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ, పాడేరులో ఆయన ఉంటున్న ఐటిడిఏ క్వార్టర్‌లో లైజన్‌వర్కర్లతో తప్పులు తొలగించారు. ఇందుకు సంబంధించిన లైజన్ వర్కర్లు ఒకరు ఇద్దరు తప్పు వెళ్లలేదన్నారు. రాలేదనే అక్కసుతో నెలకు రూ. 5000 చొప్పున కోత విధించారన్నారు. నిబంధనల ప్రకారం వారానికి ఒకరోజు మండల కేంద్రంలో మీటింగ్ పెట్టి ఎఐఐ సమీక్ష చేయాల్సి ఉండగా పాడేరుకు రావాలని నెలకు మూడు, నాలుగు దఫాలుగా పిలుస్తున్నారన్నారు. దీంతో నెలకు ఒక్కొక్క లైజన్ వర్కర్ కి వెయ్యి రూపాయలు చొప్పున అదనంగా ఖర్చు అవుతుందని తెలిపారు. నాలుగు, ఐదు రోజుల పని భారం పడుతున్నదన్నారు. ఆయన చెప్పిన విధంగా వినకపోతే మీరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులనుయ పీకేస్తానని బెదిరిస్తున్నాడని వారిని తెలిపారు. ఈ మేకు లైజన్ వర్కర్లు శుక్రవారం పాడేరు జిల్లా కలెక్టర్‌కు ఆయనపై ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే విచారణ జరిపి ఎఐఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి సంక్యాద్రి, వెంకట్ పాల్గొన్నారు

మండుతున్న ఎండలు

- అధిక ఉష్ణోగ్రతతో ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి-మాడుగుల: మండు టెండలు, అధిక ఉష్ణోగ్రతలు, ఉక్క పోతలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రోహిణి కార్తె ముగిసిన తర్వాత శనివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం చల్లటి గాలులతో భారీ వర్షం కురుస్తుందని వాతావరణం కనిపించింది. పది గంటల నుండి అధిక ఉష్ణోగ్రతతో ఎండకాసింది. మరి కొద్ది రోజులలో రుతుపవనాలు ప్రవేశిస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్న సమయంలో ఎండ ప్రతాపం చూపించింది. దీంతో, అధిక వేడి ఒక ఉక్క పోతలతో ప్రజలు నానా అగచాట్లు పడ్డారు.

నిర్మానుష్యంగా మారిన రహదారులు

నక్కపల్లి: నక్కపల్లిలో శనివారం భానుడు నిప్పులు కురిపించాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదయింది. బయటకు వెళ్లిన వారిపై నెత్తిన నిప్పుల కుంపటి పెట్టినట్టుగా భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. 43.37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం 12గంటల నుంచి ఎండతో పాటు తీవ్రమైన వడగాడ్పులు వీయడంతో ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు హడలిపోయారు. మండల కేంద్రమైన నక్కపల్లి సహా పలు గ్రామాల్లో కూడా రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండ వేడిమికి తట్టుకోలేక జనం బయటకు రావడానికి సాహసించలేదు. తప్పని పరిస్థితుల్లో బయటికి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తీవ్రమైన వడగాల్పులు వీయడంతో వాహనాలపై ప్రయాణాలు సాగించేవారు తీవ్ర అవస్థలు పడ్డారు. మహిళలు చీర కొంగును నెత్తిపై కప్పుకుని ప్రయాణాలు సాగించారు. సాయంత్రం 6గంటలకు కూడా ఎండ వేడి తగ్గకపోవడంతో వృద్ధులు, గర్భిణిలు, బాలింతలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్రకటిత విద్యుత్ కోతలతో ఫ్యాన్లు, ఏసీలు పనిచేయక పోవడంతో ఇళ్ల దగ్గర ఉన్నవారు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఓటమి భయంతో ఓట్ల తొలగింపు : అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: సిఎం జగన్మోహన్ రెడ్డి ఓటమి భయంతో ఓట్లను తొలగిస్తున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. ఈ మేరకు శనివారం మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో టిడిపి సానుభూతిపరుల ఓట్లు భారీగా తొలగిస్తున్నారని, ఏ కారణంతో తొలగిస్తున్నారో కనీసం నోటీసు కూడా జారీ చేయక పోవడం దారుణ మన్నారు. నిబంధనల ప్రకారం ఈ తొలగింపు ప్రక్రియ బూత్ లెవెల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరగాల్సి ఉండగా, వాలంటీర్లు సూచించిన విధంగా తొలగిస్తున్నారన్నారు. వైసిపికి అనుకూలంగా ఉండేవారికి దొంగ ఓట్లు భారీగా నమోదు చేస్తున్నారన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం శ్యామలానగర్ 38వ నెంబర్ బూతులో ఒకే డోర్ నెంబర్ పై 800 ఓట్లు ఉన్నాయని, ఇది ఎలా సాధ్యమో చెప్పాల్సి ఉందన్నారు.ఒక కాలేజీ డోర్ నెంబర్ మీద 46 ఓట్లు ఉన్నాయని, ఒక్క బూతులోనే సుమారు 800 దొంగ ఓట్లు నమోదు అయ్యాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని దొంగ ఓట్లు నమోదయ్యాయో ఊహించుకోవాలన్నారు. 2023 జనవరి 5వ తేదీన ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన జాబితా ప్రకారం సుమారు పది లక్షల ఓట్లను తొలగించారన్నారు. ఒక్క నర్సీపట్నం నియోజక వర్గంలోనే సుమారు17 వేల ఫేక్, డెడ్, ఓట్లను గుర్తించి, వాటిని పరిశీలించి తొలగించాలని ఆర్డీఓ కు ఫిర్యాదు చేసినా కేవలం వాటిలో 2443 ఓట్లు మాత్రమే తొలగించారన్నారు.

కల్వర్టు లేక కష్టాలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలం లోని తీగలవలస పంచాయతీ నిమ్మలగొంది గ్రామం వద్ద కల్వర్టు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. కల్వర్టు ఏర్పాటు చేస్తేనే రహదారి నిర్మాణానికి మోక్షం కలుగుతుంది.దీంతో ఈ మార్గం గుండా వెళ్లేందుకు గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిమ్మలగొంది గ్రామంలో 2016 సంవత్సరం క్రితం కల్వర్టు ఏర్పాటు చేశారు. నాణ్యత లేక పోవడంతో ఏడాది కాకుండానే వర్షాలకు కల్వర్టు కుప్ప కూలి పోయింది. ప్రస్తుతం కనీసం కాలిబాటన నడిచి వెళ్లేందుకు కుడా వీలులేని పరిస్థితి ఏర్పడింది. నిర్మించిన కల్వర్టు ఐదు ముక్కలుగా అయి చెల్లాచెదురైంది.అధికారుల పర్యవేక్షణ లేక గుత్తేదారులు తమకు నచ్చినట్లు నిర్మాణం చేపట్టారు. కల్వర్టు లేక గ్రామంలో నేటి వరకు రహదారి మంజూరు చేయలేదు.

నిమ్మలగొంది గ్రామంలో (పివిటిజి)కి చెందిన గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. 25 కుటుంబాలు 450 మంది జనాభా నివసిస్తున్నారు.




కూలి పోయిన పాత కల్వర్టు

తీగలవలస పంచాయతీ నుంచి 2.50 (రెండు నారా) కిలోమీటర్ల దూరం ఉంది. వీరంతా ఈ మార్గం గుండా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్రంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పెను భారం మోపిందని, అడ్డగోలు పెంపుతో గిరిజన ప్రాంత ప్రజల నడ్డి విరిచారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ పాడేరు కుమ్మరిపుట్టులోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాలుగేళ్లలో ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెరిగాయని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. టిడిపి హయాంలో 200 యూనిట్లు గిరిజన ప్రాంతంలో ఉచితంగా కరెంట్ ఇచ్చామని, వైసిపి అధికారం చేపట్టి గిరిజన ప్రాంత ప్రజల నడ్డి విరిచిందన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో సక్రమంగా పరిపాలన చేయలేని అసమర్ధ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బియ్యం పంపిణీ

ఫలించిన సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం పోరాటం

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం చీమల పాడు శివారు కళ్యాణపులోవ జిసిసి రేషన్ డిపో పరిధిలో ఆదివాసి రేషన్ లబ్దిదారులకు ఎట్టకేలకు బియ్యం పంపిణి చేపట్టారు. సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘంతో పాటు పలు ప్రజాసంఘాల పోరాటం ఫలితంగా మార్చి, ఏప్రిల్ నెలలకు చెందిన మూడు టన్నుల బియ్యాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు శుక్ర, శనివారాలలో పంపిణి చేశారు. జెడ్. జోగింపేట, రొచ్చుపనుకు, తాడిపర్తి, బంగారు బందల, ఆజేయపురం తదితర గిరిజన గ్రామా ల్లోని 236 మంది రేషన్ కార్డుదారులకు మార్చి, ఏప్రిల్ నెలకు సంబంధించి మూడు టన్నుల ఉచిత బియ్యం ఇవ్వాల్సి ఉండగా వారితో వేలిముద్రలు వేయించుకుని డిపో సేల్స్ మెన్ బ్లాక్ మార్కెట్లో అమ్ముకున్నాడు. సీపీఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో రేషన్ కార్డుదారులతో ఆందోళనలు చేపట్టడం తో పాటు స్పందనలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై ఏప్రిల్ 17న పలు వార్త పత్రికలలో కధనాలు ప్రచురితమయ్యాయి దీనిపై రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు, సీఎస్‌ఓటీ ఈశ్వరరావు విచారణ చేపట్టి సేల్స్ మెన్ అప్పారావు బియ్యం ఇవ్వకుండా పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. సేల్స్ మెన్‌పై 6ఎ కేసు నమోదు. చేశారు. రెండు నెలల బియ్యం తిరిగి ఇస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. నెలలు గడిచినా బియ్యం ఇవ్వక పోవడంతో ఇటీవల సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో మరో మారు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టి స్పందనలో పిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకోవాలని డీఎస్‌వోను ఆదేశించారు. దీంతో, సీఎస్‌డిటి ఈశ్వరరావు కల్యాణపులోవ జీసీసీ సేల్స్ డిపో వద్ద శుక్ర, శనివారాల్లో బియ్యం పంపిణీ చేయించారు.

అనుమతి లేకుండా కలప నిల్వచేస్తే చర్యలు

- డిఎఫ్ఓ రాజారావు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట గ్రామంలోని మణికంఠ షామిల్లులో డిఎఫ్‌వో రాజారావు బృందం శనివారం దాడులు చేశారు. ఆ షామిల్లులో అనుమతులు లేకుండా కలపను భారీ ఎత్తున నిల్వ చేస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో డిఎఫ్ఓ రాజారావు సిబ్బందితో ఆ షామిల్లులో తనిఖీలు నిర్వహించారు. సుమారు రూ.25 వేల విలువ గల టేకు, గన్నెర, పాసి కలప ఉన్నట్టు గుర్తించారు. ఆ కలపను స్వాదీనం చేసుకున్నారు. షామిల్లు యజమాని పై కేసు నమోదు చేసినట్టు డిఎఫ్ఓ రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. షామిల్లులలో అనుమతులు లేని కలపను నిల్వ చేయడంతో పాటు కటింగ్ చేయడం నేరమేనని అటువంటి వాటిపై చర్యలు. తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడి వాడ సెక్షన్ ఆటవీ సెక్షన్ అధికారి నూకరాజు, గార్డు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: గొలుగొండ మండలంలో టేకు పట్టా పర్మిట్లలో ఎటువంటి అవకతవకలు జరగలేదని నర్సీపట్నం డిఎఫ్ఓ బి.రాజారావు పేర్కొన్నారు. పట్టా కర్రల తరలింపులో ఆవకతవకలు జరిగాయంటూ ఈ ప్రాంతం నుంచి అందిన ఫిర్యాదుల మేరకు శనివారం స్థానిక విలేకరుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ మాట్లాడుతూ, మండలంలో పలుచోట్ల కలప వ్యాపారులు టేకు చెట్ల తరలింపునకు చేసుకున్న దరఖాస్తు మేరకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పట్టా రైతులు నరికిన కర్రలను వాటి మొదలు క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ మేరకు తాము ఇచ్చిన అనుమతులు మేరకే పట్టాదారులు టేకు చెట్లను నరికారని ఆయనన్నారు. తమ అనుమతితో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టేకు కర్రలను కొలతలు సరిగా ఉన్నది లేనిది పరిశీలించామన్నారు. తాము అనుమతులు ఇచ్చిన చోట చెట్లను నరికారా లేదా అనేది కూడా పరిశీలించామన్నారు. ఈ మేరకు ఇక్కడ ఎటువంటి అవకతవకులు జరగలేదని నిర్ధారణ అయ్యిందని డిఎఫ్ఓ రాజారావు తెలిపారు. డిఎఫ్ఓ వెంట రేంజర్ వెంకటరావు డిఆర్ఓ రాజేష్ గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణ్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

550వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో కొత్త పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహాధర్నా శనివారం నాటికి 550వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు పైపులైను వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంఅప్పలరాజు మాట్లాడుతూ, మత్స్యకారులకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైపులైన్ వేసుకోవడానికి ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు పిక్కి కోదండ, గోసల సోమేశ్వరరావు, చేపలు సోమేష్, అమ్మోరియ్య, బొంది శ్రీను, వాసుపిల్లి దేముడు, మైలపల్లి శివాజీ, మైలపల్లి బాపూజీ, గోసల వెంకటేష్ ,చోడిపల్లి రాజు తదితరులు

నగదు మాయంపై కేసు

ప్రజాశక్తి-కొత్తకోట: ఆటో ప్రయాణికురాలి నగదు మాయంపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్సై విభూషణరావు చెప్పారు. శనివారం సాయంత్రం ఆయన తెలిపిన కధనం మేరకు...రోలుగుంట మండలం గుండుబాడు శివారు కసిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన సింబోయిన వరహాలమ్మ జె. నాయుడుపాలెం గ్రామంలో మరో మహిళ తో కలసి కొత్తకోట వచ్చేందుకు ఆటో ఎక్కిందన్నారు. ఆటోలో అప్పటికే మరో గుర్తు తెలియని ముగ్గురు మహిళలు ఉన్నారన్నారు. బాధిత వరహాలమ్మ కొత్తకోట చేరుకొని ఆసుపత్రికి వెళ్లి గంట తర్వాత స్థానిక బ్యాంకులో నగదు జమ చేసేందుకు బ్యాంకు వద్ద బ్యాగ్‌ను చూసుకోగా సుమారు రూ. 60 వేలు నగదుతో పాటు దుస్తుల బ్యాగ్ మాయం అయ్యిందని గుర్తించదని పేర్కొన్నారు. వరహాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఎస్సై తెలిపారు.

బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బైకుల చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో పలుచోట్ల వరస బైకుల చోరీపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని జర్నలిస్ట్ సంఘం నేతలు, రాజకీయ పార్టీ నాయకులు కోరారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ శిరీష ను కలిసి మాట్లాడారు. మండలంలో సుమారు 14 బైకులు, రెండు ఆటోలను దొంగలు దొంగలించారన్నారు. నక్కపల్లి లో ఉపమాక ఆర్చి జంక్షన్ సమీపంలో ఇటీవల ఓ జర్నలిస్ట్ బైక్‌ను అపహరించారన్నారు. దొంగలిం చిన బైకులను గుర్తించి సంబంధిత వాహన దారులకు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్ఐను కోరారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఆహార భద్రతకు ముప్పు వాటిల్లరాదు

ప్రజాశక్తి - మధురవాడ

దేశంలో వ్యవసాయ రంగం కుంటుపడి ఆహార భద్రతకు ముప్పు రాకుండా చూసుకోవాలని భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవం శనివారం వర్సిటీలో ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో దేశం పురోగమిస్తోందన్నారు. దేశ యువత బాధ్యతగా మెలిగి సరికొత్త ఆలోచనలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారాలని ఆకాంక్షించారు. సాంకేతిక ప్రగతిపై దృష్టి సారించాలన్నారు. కృత్రిమ మేధ, ఛాట్ జిపిటి వంటివి మానవ మేధస్సును పక్కదారి పట్టించేవిగా ఉండకూడదన్నారు. గీతం ఛాన్సలర్ డాక్టర్ వీరేంద్ర సింగ్ చౌహన్ అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవంలో తేజ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కోటా హరినారాయణకు విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సైన్స్)ను, ప్రముఖ తెలుగు చలనచిత్ర నటి వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్ డిలిట్‌ను అందజేశారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం విశ్వవిద్యాలయం వార్షిక నివేదిక సమర్పించారు. గీతంలోని వివిధ కోర్సుల సిలబస్‌లను, బోధన విధానాలను నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా మార్పుచేశామని తెలిపారు. విశ్వవిద్యాలయం అధ్యాపకులు గడిచిన ఏడాదిలో 1900 పరిశోధన పత్రాలను వెలువరించారని, 18 పేటెంట్లను నమోదు చేశారని, 19 కన్సల్టెన్సీ ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గీతంలో 43 పరిశోధన ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయని వెల్లడించారు. ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించే దిశగా 2022- 23 విద్యా సంవత్సరంలో 4328 మందికి రూ.28.15 కోట్ల ప్రతిభా స్కాలర్‌షిప్‌లను అందజేశామన్నారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షులు ఎమ్.శ్రీభరత్, ఉపాధ్యక్షులు ఎమ్.గంగాధరరావు, కార్యదర్శి ఎమ్.భరద్వాజ, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ ప్రొ వైస్-ఛాన్సలర్లు ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, డాక్టర్ బి.గీతాంజలి, ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, వర్సిటీ అకడమిక్ డీన్‌లు పాల్గొన్నారు. విశాఖ ప్రాంగణం నుంచి 2022-23 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, లా, ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంబిఎ, బిబిఎమ్, బికామ్ వంటి కోర్సులు పూర్తి చేసిన 2769 మంది పట్టభద్రులకు స్నాతకోత్తర డిగ్రీలను, 84 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లను, అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు 72 మంది విద్యార్థులకు బంగారు పతకాలను స్నాతకోత్సవంలో అందజేశారు. ఉత్తమ పరిశోధకునిగా మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సాయి సుధాకర్ అవార్డు అందుకోగా, ఉత్తమ సిద్ధాంత వ్యాసంగా (పిహెచ్‌డి) గీతం ఫార్మశీ నుంచి పరిశోధన జరిపిన డాక్టర్ కె.అరుణ్ అవార్డు అందుకున్నారు.

వారణాసి ప్రత్యేక రైలు సేవలు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవిలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం - బెనారస్ - విశాఖపట్నం రైళ్ల సేవలను పొడిగించాలని నిర్ణయించింది. 08588 విశాఖపట్నం - బెనారస్ వీక్లీ స్పెషల్ రైలు జూన్ 21, 28 తేదీలలో మధ్యాహ్నం 12:30 గంటలకు విశాఖలో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 16:30 గంటలకు బెనారస్ చేరుకుంటుంది. 08587 బెనారస్ - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ జూన్ 22, 29 తేదీలలో సాయంత్రం 18.00 గంటలకు బెనారస్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్ళు సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగూడ, కేసింగ, టిట్లాగఢ్, బలంగీర్, బర్గర్ రోడ్, సంబల్‌పూర్, ఝర్సుగూడ, రూర్కెలా, హతియా, రాంచీ, మురి, బర్కకానా, లతేహెర్, గర్వారోడ్, సగరోడ్, సజీ, భాబువా రోడ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వారణాసి స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయి

నేడు అమిత్ షా సభ

ఉత్తరాంధ్ర నుంచి వాహనాల్లో బిజెపి జనసమీకరణ

తొమ్మిదేళ్ల బిజెపి విద్రోహ పాలనపై తిరగబడండి : ప్రజలకు వామపక్షాల పిలుపు

నేడు నగరంలో నిరసన ర్యాలీ - హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం విశాఖలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో సాయంత్రం 5 గంటలకు రైల్వే గ్రౌండ్‌లో రాజకీయ సభ నిర్వహించేందుకు బిజెపి శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి. తొలుత 8న అమిత్ షా పర్యటన ఉంటుందని ప్రకటించిన ఆ పార్టీ జనసమీకరణ సాధ్యం కాదని 11వ తేదీకి షా సభను మార్చిన విషయం తెలిసిందే. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి జనాలను వాహనాలు, ఆటోల్లో తరలించేందుకు పక్కా ప్రణాళికతో ఆ పార్టీ అనుబంధ సంస్థలన్నీ పనిచేస్తున్నాయి. కనీసం 50 వేల మందికి తగ్గకుండా సభ నిర్వహించాలని ఆ పార్టీ విశాఖ శ్రేణులు నిర్ణయించాయి.



అమిత్ షా సభకు సాగుతున్న ఏర్పాట్లు

బిజెపి పాలనలో విశాఖకు అన్నింటా అన్యాయమే

'బిజెపి దగ్గర విషం తప్ప విషయమేమీ ఉండదు' అన్న తెలంగాణ మంత్రి హరీష్‌రావు తాజా వ్యాఖ్యలు విశాఖ విషయంలో అచ్చుగుద్దినట్టు సరిపోతాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల దిశగా వెళ్లేలా చేసి నట్టేట ముంచేందుకు కేంద్రంలోని బిజెపి నాటకాలాడుతోంది. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం సాధించిన విజయాలపై ఈ బహిరంగ సభను విశాఖలో ఆదివారం సాయంత్రం బిజెపి ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ బలపడేందుకు విశాఖ, తిరుపతి వంటి ప్రధాన నగరాలను ఎంపిక చేసుకున్న సంగతి తెలిసిందే. 2024 ఎన్నికలు దగ్గరపడుతుండడంతో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, జనసేన కూడా బిజెపితో కలిసేందుకు తహతహలాడుతున్నాయి. ఇటీవలే ఢిల్లీ వెళ్లి చంద్రబాబు షాను కలవడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. వైసిపి ఎలాగూ బిజెపితోనే అంటకాగుతున్నట్టే లెక్క. అందుకే ఆ పార్టీలు బిజెపి ద్రోహంపై మాట్లాడటం లేదు. 135 ఏళ్ల చరిత్ర కలిగిన వాల్తేరు రైల్వే డివిజన్‌ను బిజెపి ఎత్తేసి రాయగడ, విజయవాడలో కలిపేసింది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను విశాఖ కేంద్రంగా ఇస్తామనే చెబుతున్నారు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చింది లేదు. గతంలో హిందుస్థాన్ జింక్‌ను వేదాంతకు కట్టబెట్టి రూ.వందల కోట్లు కమీషన్లను విశాఖ కేంద్రంగా బిజెపి నేతలు కొట్టేశారు. వందల ఎకరాలు నేడు రియల్ ఎస్టేట్‌గా మారిపోయాయి. జింక్ కోసం భూములిచ్చిన రైతులంతా నిరుపేదలయ్యారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను బంగాళాఖాతంలో ముంచెయ్యాలని మోడీ ప్రభుత్వం చూడగా విశాఖ ప్రజానీకం, కార్మికవర్గం, సిఐటియు కలసికట్టుగా పోరాడి కాపాడుకున్నాయి. వైజాగ్ పోర్టులోని బెర్తులన్నీ ఒక్కొటొక్కటిగా పిపిపిలోకి వెళ్లిపోతున్నాయి. స్థలాలను విదేశీ కంపెనీలకు కేంద్రం కట్టబెట్టేస్తోంది. ఇలా విశాఖకు ఒక్క మేలూ చేయని బిజెపి ఇక్కడ బహిరంగ సభ పెట్టి తొమ్మిదేళ్ల ఘనతను చెప్పాలనుకోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

వామపక్షాల నిరసన ర్యాలీ ఇలా..

బిజెపి విద్రోహ పాలనపై సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు ఆదివారం ఉదయం 10.30 గంటలకు రైల్వే డిఆర్ఎం కార్యాలయ జంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దగల మహాకవి గురజాడ విగ్రహం వరకూ నిరసన ర్యాలీ చేపట్టనున్నాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి ఈ ర్యాలీలో పాల్గొననున్నారు.

సుస్థిర పర్యావరణం కోసం కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సుస్థిర పర్యావరణం కోసం ఓ ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టామని, అందుకోసమే ఈ - ఆటోల వ్యవస్థను ముందుకు తెచ్చామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణకు నగరంలోని బీచ్ రోడ్డులో శనివారం ఈ - ఆటోలను నగర మేయర్ గొలగాని హరి వేంకట కుమారి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజ్, విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మతో కలిసి ప్రారంభించారు. ఆసియాకు చెందిన 'అర్బన్ క్లైమేట్ ఛేంజ్ రెసిలెన్స్ ట్రస్ట్ ఫండ్', విశాఖ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి కింద డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) నిధులతో ఈ ప్రాజెక్టు వచ్చిందన్నారు.

విసిఐసిడిపి పథకంలో భాగంగా నాలుగు స్వైపింగ్ కమ్ సర్వీస్ స్టేషన్లను ముడసర్లోవ, శాంతి ఆశ్రమం, టౌన్ కొత్తరోడ్డు ప్రాంతాల్లో నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జివిఎంసిలో వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, పర్యవేక్షణ ఇంజినీర్ రవి, కృష్ణారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రజని

జర్నలిస్టుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమైనదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. శనివారం ఉదయం జగదాంబ జంక్షన్ దగ్గర డాల్ఫిన్ డయోగ్నస్టిక్ సెంటర్‌లో అక్రిడిటేషన్ జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఉన్నా జర్నలిస్టులు విలువల కోసం పని చేస్తారని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అక్రిడేటెడ్ జర్నలిస్టులందరికీ డాల్ఫిన్ డయోగ్నస్టిక్ సెంటర్‌లో రూ.10 వేలు పైబడి ఖరీదు చేసే 56 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్టు తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమయ్యే అత్యవసర చికిత్సను కూడా ఉచితంగానే అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో మరిన్ని నగరాల్లో జర్నలిస్టుల కోసం ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన 495 మంది జర్నలిస్టులు పూర్తి స్థాయి వైద్య పరీక్షలు చేసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. అదేవిధంగా తెల్లరేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించి ఆరోగ్య బీమా మొత్తాన్ని సిఎస్ఆర్ నిధుల నుంచి చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 2023-24 సంవత్సరానికి మంజూరు కాబడిన అక్రిడిటేషన్ కార్డులను జర్నలిస్టులకు మంత్రి అందజేశారు.

క్రీడలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వ సలహాదారు జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. అన్నెపు రామచందర్ వంటి శిక్షకులు ఈ తరం క్రీడాకారులకు దొరకడం అదృష్టమన్నారు. పుట్ట మన్మథరావు మెమోరియల్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయు ఫిజికల్ ఎడ్యుకేషన్ సౌజన్యంతో ఏర్పాటైన బాస్కెట్‌బాల్ సమ్మర్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రాంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామచందర్ శిక్షణలో ఇప్పటికే ఎందరో జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధాన శిక్షకులు రామచందర్, విశాఖ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్ మోహన్‌రావు, యూనియన్ బ్యాంకు సీనియర్ మేనేజర్ జి.అప్పారావు, ఇంపీరియల్ డిజైనర్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎపి పీజీ సెట్ ప్రశాంతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రంలోని 36 కేంద్రాల్లోనూ, హైదరాబాద్ రీజియన్‌లోని ఒక కేంద్రంలోనూ నిర్వహించిన ఎపి పీజీ సెట్ 2023 విజయవంతంగా ముగిసింది. ఈ పరీక్షకు మొత్తం 30500 మంది అభ్యర్థులకుగాను 88.76 శాతంతో 27073 మంది హాజరయ్యారు. 22 సబ్జెక్టులకు 15 సెషన్స్‌లో నిర్వహించిన ఈ పరీక్షలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా చివరి రోజైన శనివారం ఈ పరీక్షల పాస్‌వర్డ్‌ను ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎపి పీజీ సెట్ - 2023 కన్వీనర్ సిహెచ్‌వివిఎస్.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13న సివిల్స్ విజేత ఆశ్రితకు సన్మానం

ప్రజాశక్తి - విశాఖపట్నం : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 2022 సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 315వ ర్యాంకు సాధించిన ఎన్.ఆశ్రితకు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు. సీనియర్ ఐఎఎస్ అధికారులతో సివిల్స్‌కు సన్నద్ధమయ్యే యువతకు ఇంటరాక్టివ్ సెషన్ కూడా కొనసాగింపుగా ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ సెమినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.